

నిబంధనలు పాటించాలి

తాళ్లపూడి : నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా గ్రామ దేవతల ఉత్సవాలు సక్రమంగా జరిగేలా ఆయా కమిటీలు బాధ్యత తీసుకోవాలని అడిషనల్ ఎస్‌పి సుబ్బరాజు సూచించారు. మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో జరుగుతున్న గ్రామ దేవత బంగారు పాపమ్మ ఉత్సవాలను శనివారం అడిషనల్ ఎస్‌పి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేలా పోలీసు బందోబస్తు పెట్టామన్నారు. పోలీసులకు అందరూ సహకరించాలన్నారు. అలాగే గ్రామ దేవతను తహశీల్దార్ లక్ష్మీలావణ్య దర్శించుకున్నారు.



సూచనలు ఇస్తున్న అడిషనల్ ఎస్‌పి

చలించరా..?

వణుకుతున్న సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు
విరిగిన కిటికీలు, గదుల తలుపులు
శిథిలావస్థలో ఉన్న భవనాల్లోనే నిర్వహణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

విరిగిన కిటికీలు, తలుపులు.. పెచ్చులూడుతున్న పైకప్పులు.. ఇదీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ హాస్టళ్ల పరిస్థితి. అసలే చలికాలం కావడంతో విరిగిన కిటికీలు, తలుపుల సందుల్లోంచి చల్లగాలులు లోపలికి రావడంతో విద్యార్థులు చిగురుటాకుల్లా వణుకుతున్నారు. జిల్లాలో ఎక్కడా వేడినీటి సౌకర్యం లేకపోవటంతో చన్నీళ్లతోనే స్నానం చేస్తున్నారు. తగినన్ని బాత్రూమ్‌లే లేక తెల్లవారుజాము నుంచే చలిలోనే స్నానాలు చేయాల్సి రావడంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల అద్దె భవనాల్లో హాస్టళ్ల నిర్వహణతో ఇరుకు గదుల మధ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణలోని బాలుర వసతి గృహం కిటికీలకు తలుపులు లేవు. చలిగాలులు వీస్తుండటంతో విద్యార్థులు కిటికీలకు బెడ్‌షీట్‌లు కట్టుకున్నారు. చన్నీళ్లతోనే స్నానం చేస్తున్నారు. రాజమహేంద్రవరం గణేష్ చౌక్ సమీపంలోని బిసి బాలికల వసతి గృహంలోనూ ఇదే పరిస్థితి. హాస్టల్‌లో కిటికీలు తుప్పుబట్టాయి. గది పైకప్పు పెచ్చులూడుతుంది. రాజమహేంద్రవరంలోని బిసి హాస్టల్‌లో కిటికీ తలుపులకు రంధ్రాలు పడ్డాయి. వాటి గుండా చల్ల గాలి వీస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కిటికీలకు తలుపులు బిగించాలని విద్యార్థులు కోరుతున్నారు. గదుల కొరత విద్యార్థులకు శాపంగా మారింది. రాత్రి వేళ పడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. స్థలం లేక దుస్తులను పక్క ప్లాట్లలో ఆరబెడుతున్నారు. బాత్‌రుమ్‌లు అరకొరగా ఉన్నాయి. చన్నీటితో స్నానాలు చేసేందుకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కీటికీలు, డోర్లు సక్రమంగా లేక చలికి వణికిపోతున్నారు. బాత్‌రూమ్‌ల దగ్గర లైట్లు సరిగా లేవు. తలుపులు లేక చలికి ఇబ్బంది పడుతున్నారు. గోపాలపురంలోని ఎస్‌సి హాస్టల్‌లోనూ కిటికీలకు తలుపులు సరిగాలేవు. ఎస్‌సి హాస్టల్‌లో మాత్రం అరకొరగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఎస్‌టి హాస్టల్స్‌లో స్కూల్ విద్యార్థులకు మాత్రమే దుప్పట్లు పంపిణీ జరిగింది. కాలేజి హాస్టల్ విద్యార్థులు ఇంటి నుంచి బెడ్‌షీట్లు తెచ్చుకుంటున్నారు.



నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు

మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఉండ్రాజవరంలోని ఎస్‌సి బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తేశ్లాబు నుంచి నీరు కారుతోంది. ప్రస్తుతం ఆ వసతి గృహంలో 20 మంది విద్యార్థులు ఉన్నారు. గోపాలపురంలో రెండు హాస్టల్స్ అద్దె భవనాలల్లో కొనసాగుతున్నాయి. ఎస్‌సి బాలుర హాస్టల్ శిథిలావస్థకు చేరుకోవటంతో అద్దె భవనంలోకి మార్చారు. ఈ హాస్టల్‌లో విద్యార్థులు నేలపైనే కార్పెట్‌లు వేసుకుని నిద్రిస్తున్నారు. ఇక్కడ కూడా మరుగుదొడ్ల అధ్వాన్నంగా ఉన్నాయి.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

వారం రోజులుగా జిల్లాలో పగటి, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఇప్పటికే రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలకు దిగువనే నమోదవుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 17 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగత్రలు నమోదుకాగా, మున్ముందు మరింత పడిపోయే అవకాశం ఉంది. దీంతో చలి తీవ్రత విపరీతంగా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని విద్యార్థులు కోరుతున్నారు.

జిల్లాలో వసతిగృహాలు, విద్యార్థుల వివరాలు

హాస్టల్ పేరు	ప్రీ మెట్రిక్	పోస్టు మెట్రిక్	విద్యార్థులు
బిసి సంక్షేమం	07	13	1,347
ఎస్‌సి సంక్షేమం	24	08	2,700
ఎస్‌టి సంక్షేమం	01	09	1,949
మొత్తం	32	30	5.996



ఉండ్రాజవరం ఎస్‌సి బాలుర వసతిగృహం



రాజమండ్రి ఎస్‌టి హాస్టల్‌లో తాగునీటి కుళాయిలు ఇలా...

స్కూల్ విద్యార్థులకు మాత్రమే దుప్పట్లు పంపిణీ

వసతి గృహాల్లో ఉంటున్న స్కూలు విద్యార్థులకు మాత్రమే దుప్పట్లు పంపిణీ చేసే అవకాశం ఉంది. 200 మందికి దుప్పట్లు పంపిణీ చేశాము. కిటికీలు, తులుపులు మరమ్మతులు చేయించేందుకు రూ.51 లక్షల అంచనాతో ప్రతిపాదనలు పంపించాం. ఎస్‌టి బాలిక హాస్టల్ నిర్మాణానికి రూ.1.30 కోట్లతో, బాయ్స్ హాస్టల్ అదనపు గదుల నిర్మాణానికి రూ.66 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు లభిస్తే త్వరిత గతిన అందుబాటులోకి తెస్తాము.

- కెఎస్.జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి

సదరం స్లాట్ కోసం నిరీక్షణ

రెండు రోజులైనా ప్రారంభం కాని వైనం
ఇబ్బందులు పడుతున్న వికలాంగులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

శారీరక, మానసిక లోపాలు ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వం వారికి ప్రత్యేకంగా పెన్షన్లు మంజూరు చేస్తోంది. దీని కోసం సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. ఈ సర్టిఫికెట్ కోసం అభ్యర్థులు ముందుగా స్లాట్‌ను బుక్ చేసుకోవాల్సి ఉంది. అయితే సాంకేతికలోపం కారణంగా రెండు రోజులుగా సదరం క్యాంపులకు స్లాట్‌లు బుక్ కావట్లేదు. ఈ నెల 14 నుంచి స్లాట్‌ల బుకింగ్ పునప్రారంభమవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ ప్రక్రియ డిసెంబర్ నెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు. అయితే శనివారం సాయంత్రం వరకు స్లాట్‌ల బుకింగ్ ప్రారంభం కాలేదు. దీంతో వికలాంగులు ఎన్నో వ్యయప్రయాసలోర్చి మీ సేవ కార్యాలయాలు, సచివాలయాల చుట్టూ తిరుగుతునే ఉన్నారు. అసలే వికలాంగులు మరో వ్యక్తి తోడు ఉంటేగాని బయటకు వెళ్ళలేని దీన స్థితి, అయినా పెన్షను కోసం వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులు పూర్తవుతున్నా ఇంకా ప్రారంభం కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నూతనంగా పెన్షన్ పొందాలనుకునే వారు, తమ వికలాంగత్వాన్ని నిరూపించుకునేందుకు, వికలాంగ ధ్రువీకరణ పత్రాన్ని పొందడానికి ప్రభుత్వం నిబంధనలను పాటించాల్సి ఉంది. ఈ నిబంధనలే వీరికి తలనొప్పిగా పరిణమించాయి. నిబంధనల్లో భాగంగా ప్రభుత్వం ప్రతీ మూడు నెలలకు ఒకసారి సదరం స్లాట్‌లను విడుదల చేస్తుంది. ఈ సదరం స్లాట్స్‌ను వికలాంగులు సచీవలయాల్లోగాని లేదా మీ సేవా కేంద్రాల్లో గాని ఆధార్, తెల్ల రేషన్ కార్డులు చూపించి నమోదు చేయించుకోవాలి. ఇలా స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వా సుపత్రులకు తేదీతో కూడిన అనుమతి లభిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా నిర్ణయించి తేదీల్లో సంబంధిత హాస్పటల్‌లో ఏర్పాటు చేసిన సదరం శిబిరాలకు వికలాంగులకు హాజరుకావాల్సి ఉంది. అక్కడ వైద్యులు వారిని పరిశీలించి అనంతరం సదరం సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తారు. లోపం తీవ్రతను బట్టి వికలాంగత్వాన్ని ఆ సర్టిఫికెట్‌లో పొందుపరుస్తారు. తరువాత పింఛను కోసం ఈ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

స్లాట్‌ల బుకింగ్ మీసేవా కేంద్రాలకు లేనట్టే?

సదరం స్లాట్‌ల బుకింగ్ సచివాలయ వ్యవస్థ రాక ముందు మీ సేవా కేంద్రాల ద్వారా కొనసాగింది. ఆ తరువాత మీ సేవలతో పాటు సచివాలయాల్లో కూడా బుక్ చేసే వెసులుబాటు ఉండేది. అయితే ఈ సారి మీసేవా కేంద్రాల్లో సదరం స్లాట్ సేవలను మినహాయించినట్టు సమాచారం.. మీ సేవలకు సదరం లాగిన్ తొలగించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. కేవలం సచివాలయాల్లోనే కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. దీనిపై మీ సేవా కేంద్రాల యూనియన్ నాయకులు ఉన్నతాధికారులను కలిసేందుకు సిద్ధమవుతున్నారు.

రూ.2లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ


అరుదైన వ్యాధితో భాదపడుతున్న నిహార్ అనే చిన్నారికి ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు చేతుల మీదుగా రూ.2లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్కును చిన్నారి తల్లిదండ్రులకు అందించారు. శనివారం తన కార్యాలయానికి చినారి తల్లి దండ్రులను పిలిచి వారికి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పారు. పాపను అన్ని విధాలా ఆదుకుంటామని, సదరన్ సర్టిఫికెట్ రాగానే పెక్షన్ అందేలా చర్యలు చేపడతానన్నారు. చిన్నారి తండ్రి డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, అతనికి వైద్యం చేయించే స్థోమత లేదన్నారు. తన కూతురు వైద్యానికి సహకరించాలని సామాజిక మాద్యమాల్లో వీడియో పెట్టడంతో స్పందించిన దాతలు రూ.3లక్షల వరకూ సాయం అందించారన్నారు. చిన్నారి కుటుంబానికి అండగా నిలిచిన సామాజిక సేవకుడు సుభాన్, దేవి వర ప్రసాద్‌లను ఎంఎల్ఎ అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం 4,820 హెక్టార్లలో స్వర్ణ, ఎంపియు 1318, పిఎల్ఎ 1100 రకాల వంగడాల వరి పండిస్తుండగా, ఇప్పటి వరకు 650 హెక్టార్ల పైబడి కోతలు పూర్తయ్యాయని ఎఒ రాజారావు తెలిపారు. కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్టూ'నిజం'



ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

గ్రంథాలయ వారోత్సవాలు జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నాయి. వివిధ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నారు. పుస్తక పఠనం ఆవశ్యకతపై సదస్సులు, సమావేశాలను నిర్వహిస్తున్నారు.

రాజమహేంద్రవరంలోని సీతంపేట పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తక ప్రాముఖ్యతపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి డి.వెంకట రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో విశ్రాంత గ్రంథాలయ కార్యదర్శి మారిశెట్టి సత్యనారాయణ, బుడ్డిగ గోపాలకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సిఎస్ఆర్ .రంగనాథన్, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మారిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలను విరివిగా ఉపయోగించుకోవాలన్నారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ పుస్తక పఠనం ఒక అభ్యాసంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. టౌన్ హై స్కూల్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గ్రంథాలయ సిబ్బంది డి.రాజు, ఎ.కృష్ణశర్మ, ఎస్‌కె.మూర్తి, కెవిపిలక్ష్మి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఇన్నీస్‌పేట శాఖా గ్రంథాలయంలో ఓల్డ్ టౌన్ స్కూల్ హెచ్‌ఎం ఆధ్వర్యంలో చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. విటి కళాశాల ఎకనమిక్స్ లెక్చరర్



సీతంపేట గ్రంథాలయంలో పాల్గొన్న విద్యార్థులు

డాక్టర్.వై.ప్రభాకరరావు మాట్లడుతూ గ్రంథాలయాల ప్రాముఖ్యత ఉనికి తెలియచేయడమే గ్రంథాలయ వారోత్సవాల లక్ష్యం అన్నారు. విద్యార్థులకు విజ్ఞాన దాయక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇంగ్లీష్ లెక్చరర్ నల్లి రవికుమార్ మాట్లాడుతూ గ్రంథాలయంలో కంప్యూటర్ సౌకర్యం ఉందని, విద్యార్థులు ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఓల్డ్ టౌన్, మహావీర్, విటి కాలేజీ, మెగా కాలేజీ విద్యార్థులు 70 మంది పాల్గొన్నారు. ఇన్నీసు పేట శాఖా గ్రంథాలయ అభివద్ధి కమిటీ సభ్యులు వానపల్లి శ్రీరామచంద్రమూర్తి, పాలవలస బాబ్జి, రాజమహేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఎస్.రమేష్, సెంట్రల్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు ఎస్.సీతాపతి, సిహెచ్.దేవశ్రీ, ఐ.సుబ్రహ్మణ్యం, లైబ్రేరియన్ శ్రేదేవి పాల్గొన్నారు.

దేవరపల్లి గంథాలయంలో చదరంగం పోటీలు నిర్వహించామని లైబ్రేరియన్ వి.సత్యనారాయణ తెలిపారు. ఈ పోటీలకు భాష్యం స్కూల్, హర్షవర్ధన్ స్కూల్, సత్యసాయి స్కూల్, చైతన్య స్కూల్ ,జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన సుమారు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. న్యాయ నిర్ణేతలుగా దొడ్డికర్ల రాజు, ఎస్.మణిమూర్తి, ఆర్.జగదీష్, బి.శ్యామ్, జి.చిరంజీవి, ఎం..లక్ష్మణ్ వ్యవహరించారు. విజేతలకు ఈ నెల 20న జరిగే ముగింపు సభలో ఎంఎల్ఎ చేతుల మీదుగా బహుమతులు అందిస్తామన్నారు.

చాగల్లు మండలం చంద్రవరం శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఎంపియుపి స్కూల్ అసిస్టెంట్ వి.వెంకటలక్ష్మి ప్రారంభించారు. వెల్ఫేర్ అసిస్ట్ కె.ప్రదీప్‌కుమార్, డిజిటల్ అసిస్టెంట్ బి.ఫణిగోపాలకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రదీప్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో చదువుకునే ఎంతోమంది ఉన్నత స్థానాల్లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ లైబ్రరీ ఇన్‌ఛార్జి మద్దిపాటి సూర్యారావు, లైబ్రేరియన్ సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.కోట్లు దోచుకున్న భరత్‌రామ్ : మజ్జి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

మాజీ ఎంపీ భరత్ రామ్ అధికారంలో ఉండగా కోట్లాది రూపాయిలు దోచుకున్నాడని, అతని అవినీతి చిట్టా వింటుంటే ఆశ్చర్యం వేస్తుందని టిడిపి రాజమహేంద్రవరం అధ్యక్షులు మజ్జి రాంబాబు విమర్శించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అతని మాజీ మిత్రడు రామ్ శర్మ నోరు విప్పి భరత్ గుట్టు బయట పెట్టాడన్నారు. కోట్లది రూపాయిలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మజ్జి రాంబాబు

వసూలు చేసి స్వయంగా భరత్‌కు ఇచ్చినట్టు శర్మ చెబుతున్నారని, దీనికి ఇంకేమి సాక్షాలు కావాలని మజ్జి రాంబాబు ప్రశ్నించారు. రామ్‌శర్మ చేసిన ఆరోపణల్లో నిజం లేదా? అన్నారు. లేక పోతే భరత్ రామ్ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. తమ ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు చేస్తున్న పనులకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, అది చూసి ఓర్వలేకే భరత్ రామ్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో 23వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి యిన్నమూరి దీపు, టిడిపి నాయకులు ఉప్పులూరి జానకిరామయ్య, కడలి రామకృష్ణ, కంటిపూడి శ్రీనివాస్, పిల్లి శ్యామ్, ముత్యం సత్తిబాబు, ముద్రగడ జయరామ్, చాపల చిన్నిరాజు, షేక్ బషీర్, మదీనా సాహేబ్ పాల్గొన్నారు.



విద్యార్థినుల గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శన

ఆకట్టుకున్న గిరిజన బాలికల ప్రదర్శనలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకల ముగింపులో భాగంగా గిరిజన విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాఉరు. ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి, ఎంఎల్‌సి సోము వీర్రాజు, జెసి వై.మేఘస్వరూప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులు, బాలికల కళాశాల వసతిగృహం విద్యార్థులు వివిధ ప్రదర్శనలు నిర్విహించారు. గిరిజన సంప్రదాయ నృత్యాలు, గీతాలు, కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 15 రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఆర్.రుచితకుమారి, ప్రణీత, బి.దీప్తిప్రియ వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. గిరిజన సంప్రదాయ వస్త్రధారణతో నిర్వహించిన ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

త్యాజంపూడిలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం

ప్రజాశక్తి -దేవరపల్లి

ఏలూరు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో త్యాజంపూడి గ్రామంలో శనివారం ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ మోసాలు, వాటి నుంచి ఎలా జాగ్రత్తపడాలి వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే డిసిసిబి బ్యాంక్ ద్వారా రైతులకు, మహిళలకు, చిన్న వ్యాపారులకు లభించే రుణ సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.కోటి విలువైన రుణాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యర్నగూడెం బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కొప్పిశెట్టి శ్రీనివాస్, సూపర్‌వైజర్ పి.శశికాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో ఆర్‌డిఒ తనిఖీలు

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు పట్టణం, దొమ్మేరు గ్రామంలోని రేషన్ షాపుల్లో ఆర్‌డిఒ రాణిసుస్మిత శనివారం తనిఖీలు నిర్వహించారు. రేషన్ పంపిణీ విధానం, రికార్డులు, స్టాక్ వివరాలను ఆమె సమగ్రంగా పరిశీలించారు. మత్స్యకారులకు రేషన్ సరుకులు ఇప్పటికీ పంపిణీ చేయకపోవడంపై సిఎస్‌టిటి సునీతను ప్రశ్నించారు. రేషన్ సరఫరాలో ఆలస్యానికి కారణాలు తెలియజేయాలని ఆదేశించారు. రేషన్ పంపిణీకి సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఎవరికైనా ఇబ్బందులు లేకుండా సమయానికి రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట రేషన్ డిపో సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో 'స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం :తీఓష

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. 'వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత" అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు మూడు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణం, తరగతి గదులు, మార్గమధ్యం, తోటలు మరియు పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు.. చేతుల శుభ్రత ప్రాముఖ్యత, రోజువారీ పరిశుభ్రత అలవాట్లు, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత విద్యాసంస్థ నిర్మాణం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛంద స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జె.సురేష్, డాక్టర్ యూసుఫ్ భాషా, దుర్గాలక్ష్మి, జె.యాకోబు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం జెఎండ్‌టి రోడ్డులోని ఈట్ స్ట్రీట్ వద్ద పరిశుభ్రత ఫోటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. పరిశుభ్రతను ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్, వక్తత్వం, చిత్రలేఖన పోటీల్లో



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, సెక్రటరీ శైలజావల్లి, ఎంహెచ్ఒ వినూత్న, ఇన్‌ఛార్జి ఎస్ఇ రీటా, ఇఇ మాధవి, సిఎంఎం రామలక్ష్మి పాల్గొన్నారు

రాజమహేంద్రవరం రూరల్ : డిఎంహెచ్ఒ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె.సంధ్య, డిపిఎంఒ డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ షమ్మి, యుఐపి ప్రోగ్రామ్ ఆఫీసర్, జిల్లా ఎపిడిమాలజిస్ట్ బి.సుదీర్ బాబు, డిప్యూటీ డెమో పి.సత్యవతి సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు : స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్రాలో ప్రతి పౌరుడు భాగస్వామ్యుడు కావాలని ఆర్‌డిఒ రాణిసుస్మిత సూచించారు. కొవ్వూరులో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆ కార్యక్రమంలో భాగంగా నవంబర్ నెలను 'హైజీన్ - పరిసర పరిశుభ్రత - వ్యక్తిగత పరిశుభ్రత మాసం'గా ప్రకటించి, ప్రజలలో పరిశుభ్రతపై చైతన్యం పెంచే చర్యలు చేపటాట్టమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని అధికారులు, ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

చాగల్లు : స్వచ్ఛ ఆంధ్రా స్వర్ణాంధ్ర కార్యక్రమం చాగల్లు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు హ్యాండ్ వాష్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చాగల్లు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వాసవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న ప్రసాద ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ఖండవల్లికి చెందిన గొల్లి సూర్యారావు, సత్తెమ్మ దంపతులు వారి కుటుంబ సభ్యులు అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అన్నప్రసాద ట్రస్టునకు తత్కాల్ విరాళంగా రూ.50వేలు, శాశ్వత విరాళంగా 30వేలు అందించారు. ఈ మొత్తాన్ని దేవస్థాన కార్యనిర్వాహన అధికారి ఎం.రాధాకష్ణకు శనివారం అందించారు.



విరాళం అందిస్తున్న సూర్యారావు కుటుంబ సభ్యులు

నేరాలు ఘోరాలు


ఘటనా ప్రాంతంలో భాస్కరరావు మృతదేహం

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని బాలాంత్రం గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పంపన భాస్కరరావు(60) మృతి చెందాడు. బాలాంత్రం నుంచి బైకుపై వస్తున్న విత్తనాల శివ, భాస్కరరావులను యానాం వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో భాస్కరరావు ఘటనా స్థలంలో మృతి చెందాడు. గాయపడిన విత్తనాల శివను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి గొల్లప్రోలు

ఒక మహిళ అదృశ్యంపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని దుర్గాడ గ్రామానికి చెందిన ఉగ్గిరాల వీరబాబుకు తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన నాగ దుర్గ వెంకటలక్ష్మితో ఐదేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి పిల్లలు లేరు. ఈ నెల 11న పనికి వెళ్లిన వీరబాబు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా భార్య వెంకటలక్ష్మి కనిపించలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు చుట్టుపక్కల గ్రామాల్లో బంధుమిత్రులు ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు.

8 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

కోరుకొండ ఎక్సైజ్ సిఐ శ్రీనివాస బాలాజీ ఆధ్వర్యంలో శనివారం బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. పురుషోత్తపట్నం కాలనీ బస్టాండ్ వద్ద బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కటికల శ్రీనును అరెస్టు చేశారు. 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుని కోర్టులో హాజరు పరుస్తామని ఎక్సైజ్ సిఐ తెలిపారు.

హుండీల దొంగలకు రిమాండ్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం, తాడిపర్రు రోడ్డులో, పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లోని హుండీల చోరీ కేసులో పిందితులు నక్కపల్లికి చెందిన అనుమాను శ్రీను, ఉండ్రాజవరానికి చెందిన మరో మైనర్‌ను ఉండ్రాజవరం ఎస్ఐ డి.రవికుమార్ అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని, మైనర్‌ను జువైనల్ హోమ్‌కు తరలించారని ఎస్ఐ తెలిపారు.

యానాం సిఐ సస్పెన్షన్

ప్రజాశక్తి - యానాం

యానాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అడలరసన్‌ను సస్పెండ్ చేస్తూ పుదుచ్చేరి ఐజి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పోక్సో కేసులో ఒక నిందితుని పుదుచ్చేరి తీసుకుని వెళ్లి తిరిగి వస్తుండగా వచ్చే దారిలో మద్యం తాగి డ్యాన్సులు చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఈ విషయం ఐజి అజిత్ కుమార్ దృష్టికి వెళ్లింది. దీంతో సిఐ అడలరసన్‌ను సస్పెండ్ చేస్తూ మాహే పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఈ వీడియోపై సిఐ అడలరసన్ స్పందిస్తూ మద్యం సేవించలేదని, డ్యూటీలో ఉన్న అయ్యప్ప స్వామి మాల వేసుకున్న కానిస్టేబుల్ తెచ్చుకున్న మజ్జిగను గ్లాస్‌లో వేసుకుని తాగుతూ డాన్స్ చేశానని వివరణ ఇచ్చారు.

662 ఉపాధి పనుల గుర్తింపు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద 662 పనులను గుర్తించామని, వీటి మంజూరుకు ప్రతిపాదనలు పంపామని ఎపిఒ సత్యవతి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామసభలను నిర్వహించామన్నారు. 373 పంట కాలువలు నిర్మాణం, 162 సోక్ పిట్స్, 52 కంపోస్ట్ పిట్స్, 25 మట్టి రోడ్ల నిర్మాణం, 25 ఫారం పాండ్లు, 23 చెరువుల పనులు, 6 పండ్ల తోటలకు కందకాల తవ్వకం, 6 పండ్ల తోటల పెంపకం పనులను ప్రతిపాదించారు. అలాగే మునికూడలి, వెదుళ్లపల్లిలో ప్రత్యేక గ్రామసభలను ఎపిఒ బివి.సత్యవతి ఆధ్వర్యంలో మునికూడలి, వెదుళ్లపల్లి గ్రామ పంచాయతీల్లో ఉపాధి గుర్తింపు గ్రామసభలు జరిగాయి. కార్యక్రమాల్లో సర్పంచ్ ఆరుమిల్లి సత్యవతి, పంచాయతీ కార్యదర్శి విఠల్, సహకార సంఘం అధ్యక్షులు సానిపిని వెంకట రామారావు, వార్డు మెంబరు ఆరుమిల్లి సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనులకు అండగా ఉంటా'

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

గిరిజనులకు ఏ కష్టం వచ్చినా ఎంఎంఆర్ ట్రస్ట్ తరుపున ఆదుకుంటామని ట్రస్ట్ చైర్మన్, వైసిపి నర్సాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని బవురువాకకు చెందిన జర్త సింహాచలం ఇటీవల గాయపడటంతో ముదునూరి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సింహాచలానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, శేశెట్టి కోదండ, ఎంపిటిసి నానిపల్లి చంటి, బొల్లు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలకు గ్యాస్ స్టవ్ అందజేత

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని వాదాలకుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-2కు 'మాదిగ యువజన సేవా సంఘం సభ్యులు రూ.5వేల విలువ చేసే గ్యాస్ స్టవ్‌ను శనివారం అందజేశారు. హెచ్‌ఎం ఇస్సాపురి కృష్ణయ్య మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు వంట చేసేందుకు ఈ స్టవ్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అయినపర్తి రవిశేఖర్, సెక్రటరీ బల్లి శ్రీను, సభ్యులు కాకినాడ మోహన్ రాజు, కొడమంచిలి రవితేజ, ప్రతిపాటి సూరజ్, తిగిరిపల్లి మధు, బి.చందు, వి.నవీన్, ఉపాధ్యాయులు, సిఆర్‌పి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఎప్పటికి అందేనో..?

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

మొంథా తుపాను ప్రభావంతో అన్నదాతలు ఆశలు అతలాకుతలమయ్యాయి. లక్షలాది ఎకరాల్లో పంటను కోల్పోయారు. నష్టం వాటిల్లి 20 రోజులైనా నేటికీ వారికి ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. పంటనష్టపోయిన రైతన్నలు సర్కారు సాయం కోసం దీనంగా ఎదురు చూసున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, వాణిజ్య, ఉద్యాన పంటలు అక్షరాలా 1.74 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఆరుగాలం పండించిన రైతన్న కష్టం ఒక్కసారిగా ఆవిరైపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరించింది. తుపాను అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి పర్యటన తప్ప రైతులకు ఎటువంటి స్పష్టమైన భరోసా లభించలేదు. తుపాను అనంతరం ఎన్యూమరేషన్ ప్రక్రియపైనా పలు విమర్శలు వినిపించాయి. ఎన్యుమరేషన్ ప్రక్రియ మొక్కుబడిగా సాగిందని అన్నదాలు గగ్గోలు పెట్టారు. ఎన్యుమరేషన్ ప్రక్రియకు ముందే ఒకసారి పంట నష్టంలో లెక్కిస్తే ఆ ధాన్యం కొనుగోలు చేయబోమని అధికార యంత్రాంగ చెప్పడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు .33 శాతానికిపైగా పంట నష్టం జరిగితేనే నష్టం జాబితాలో చోటు దక్కింది. దీంతో రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగలేదు. కనీసం పంట నష్టం అయినా సకాలంలో అందించి ఆదుకుంటారని భావించిన అన్నదాతలకు నిరాసే ఎదురైంది. ఎన్యుమరేషన్ ప్రక్రియ ముగిసి వారం రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా రైతాంగం సుమారు రూ.250 కోట్లకు పైగా నష్టపోయినట్లు అంచనా. కేంద్రం బృందం వచ్చి జిల్లాకు రెండు మూడు గ్రామాల్లో మాత్రం పర్యటించి వెళ్లిపోయింది. నష్టంపై ముఖ్యమంత్రితో మాట్లాడి నివేదిక అందిస్తామని మాత్రమే చెప్పింది. కొన్ని ప్రాంతాల రైతులకు కేంద్ర బృందం వచ్చినట్లు కూడా తెలీని పరిస్థితి. పలుచోట్ల అన్నదాతలు ఈ బృందానికి వినతిపత్రాలు అందించారు. కాని వాటిని పట్టించుకున్న దాఖలాలు ఎక్కడా కానరాలేదు.

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి సాగును కష్టాలు నీడలా వెను వెంటే ఉన్నాయి. తొలుత అకాల వర్షాలు, ఆపై యూరియా కష్టాలు చివరికి మొంథా తుఫానుతో రైతన్నను వెన్ను విరిచాయి. అయితే పై మూడు దశలలోనూ ప్రభుత్వం రైతులకు అండగా నిలబడకపోగా ప్రభుత్వ యంత్రాంగం భిన్నంగా వ్యవహరించిన తీరు ఆందోళనకు గురి చేసింది. యూరియా కొరత సమస్యను పరిష్కరించకపోగా రైతులు అధికంగా కొనుగోలు చేశారని, కొద్ది మంది వద్ద ఈ నిల్వలు అధికంగా ఉండటం, ఉద్దేశ పూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ చేసిన వాఖ్యలు పాలకుల చిత్తశుద్ధిని దర్పణం పట్టాయి. తాజాగా ధాన్యం కొనుగోలులోనూ నిర్లక్ష్యం వెంటాడుతోంది. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించటంతో రైతులను దళారులను ఆశ్రయించక తప్పలేదు. ప్రభుఏత్వం ప్రకటించిన మద్దతు ధరకు బస్తా రూ.400 నుంచి రూ.300 తక్కువకు వ్యాపారులు యదేచ్చగా కొనుగోలు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా ప్రకటించిన హామీ సైతం నేటికీ ఆచరణలో అమలుకు నోచుకలేదు. తుపాను నేపథ్యంలో తేమ శాతం నిబంధనలను సడలిస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి తక్షణమే పంటనష్ట పరిహారం అందజేయాలని రైతులు వేడుకుంటున్నారు.



మరోపక్క జిల్లాపై చలి పులి పంజాను విసిరింది. రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలకంటే తక్కువగా నమోదవుతున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఫలితంగా ప్రజారోగ్యంపైనా ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో జిల్లా కేంద్ర ఆస్పత్రులకు తరలి వస్తున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ ఆస్పత్రులతో పాటు అమలాపురం ఆస్పత్రిలోనూ రోగుల సంఖ్య పెరిగింది. చలి తీవ్రతతో హాస్టల్ విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం దుప్పట్లు కూడా లేకపోవడం, కొన్ని వసతి గృహాలకు తలుపులు, కిటికీలు లేకపోవడంతో చలికి వణుకుతూనే చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి.

తిమ్మక్కకు మార్గాని కుటుంబంతో అనుబంధం

ప్రజాశక్తి-కడియం

'భారతదేశ తల్లి తెన్నె' (మదర్ ఆఫ్ ట్రీ)గా పిలువబడే కర్ణాటకకు చెందిన ప్రసిద్ధ పర్యావరణ కార్యకర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత సాలుమరద తిమ్మక్క శుక్రవారం మృతి చెందారు. 114 ఏళ్ల ఆమె దశాబ్దాల నుంచి వేలాది మొక్కలు నాటుతూ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. మొక్కలనే పిల్లలుగా చూసుకుంటూ రోడ్ల పక్కన మొక్కలు నాటుతూ వాటిని పెంచి పోషించి చెట్లుగా మార్చారు. ఆమె కృషికి పలు జాతీయ అంతర్జాతీయ అవార్డులు అందుకుఅన్నరు. ఆమె సేవా కార్యక్రమాలను పాఠ్యపుస్తకంలో ప్రచురించారు. తిమ్మక్కకు కడియం గౌతమి నర్సరీ యువ రైతు మార్గాని వెంకట శేషు కుటుంబంతో మంచి సంబంధాలున్నాయి. 2019లో తిమ్మక్కకు పర్యావరణంకు సంబంధించి పద్మశ్రీ అవార్డు వచ్చింది. శేషు ఆమె ఇంటికి వెళ్లి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పర్యావరణానికి సంబంధించి పద్మశ్రీ అవార్డు తీసుకున్న వాళ్లందర్నీ కలవడం ఈ యువకుడుని అలవాటుగా మారింది. అలాగే శేషు తల్లి సత్య కొత్త రకం మొక్కలను ఉత్పత్తి చేయడం విశేష గుర్తింపు పొందారు. సత్య కృషి కూడా తిమ్మక్కను విశేషంగా ఆకట్టుకుంది. పలుసార్లు కుటుంబ సభ్యులతో సహా తిమ్మక్కను కలుసుకున్నారు. కాల క్రమేణా మరింత దగ్గరయ్యారు.



తిమ్మక్కకు మొక్కను అందిస్తున్న శివ(ఫైల్)

ప్రతి ఏటా కర్ణాటక ప్రభుత్వం జాతీయ స్థాయిలో తిమ్మక్క పేరున పర్యావరణ అవార్డులు ఇస్తూ ఉంటారు. 2022లో సత్యకు అవార్డు ఇవ్వాలని తిమ్మక్క రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై,తిమ్మక్కల చేతుల మీదుగా సత్య అవార్డును అందుకున్నారు. తిమ్మక్క అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న శేషు కుటుంబం ఆర్థిక సహాయం చేసి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేసింది. తిమ్మక్క మతి తమను ఎంతో కలిచివేసిందని గౌతమి నర్సరీ రైతులు మార్గాని వీరబాబు, సత్య, శేషులు తెలిపారు.

సచివాలయాల్లో కానరాని కార్యదర్శులు

ప్రజాశక్తి - రాజానగరం

ప్రజలకు అందుబాటులో ఉండడానికి ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసింది. కాని ప్రస్తుతం ఏ సచివాలయంలోనూ కార్యదర్శులు అందు బాటులో ఉండట్లేదు. దీంతో ఇవి నిరుప యోగంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో 34 గ్రామాల్లో సచివాలయాలు ఉన్నాయి. సచివాలయం పరిధిలో పారిశుధ్యం, తాగు నీటి సరఫరా, రోడ్ల తదితర పనుల పర్యవేక్షణలో కార్యదర్శులదే ప్రధాన పాత్ర. మండలంలో రాజానగరం, తోకాడ, కానవరం, మల్లంపూడి, పాలచర్ల, పుణ్యక్షేత్రం, దివాన్ చెరువు, తూర్పు గానుగూడెం, వెలుగుబంద, హౌసింగ్ బోర్డు, పుణ్యక్షేత్రం తదితర కార్యదర్శులు కేంద్రాలకు దూరంగా పట్టణాల్లో నివాసం ఉంటూ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయాలకు ప్రభుత్వ పింఛన్లు ఇచ్చే సమయంలో అంటే నెలలో మెదటి రెండు రోజులు మాత్రమే వారు కనిపిస్తున్నారని, మిగిలిన సమయాల్లో కనిపించట్లేదని ప్రజలు గగ్గోలు పెడుతు న్నారు. కాని ప్రతి రోజూ మాత్రం కార్యాలయాల్లో విధులకు హాజరైనట్టు రికార్డుల్లో నమోదై ఉంటుంది. సమస్యలు చెప్పుకునేందుకు కార్యాలయానికి వెళితే కార్యదర్శులు కలెక్టర్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో సమావేశాల్లో ఉన్నారని సిబ్బంది చెబుతున్నారు. సిబ్బంది జీతాలు, గ్రామాల్లో పనులకు సంతకాల కోసం ఇంటికి పిలుపించుకుని సంతకాలు చేసి పంపిన ఘటనలు కోకొల్లలు. కొన్ని సచివాలయాలు అయితే మధ్యాహ్నం 3 గంటలకే మూతబడు తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో సచివా లయం ఉద్యోగులు విధులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.


సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

దువ్వూరి త్యాగం నేటి తరానికి తెలియాలి

ప్రజాశక్తి-కడియం

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు దువ్వూరి సుబ్బమ్మ త్యాగం నేటి తరానికి తెలియాలని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. శనివారం కడియంలో దువ్వూరి సుబ్బమ్మ 145వ జయంతిని చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ఎంపిపి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దువ్వూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిపి ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో జైలుకు వెళ్లిన తొలి తెలుగు మహిళ దువ్వూరి కడియం గ్రామస్తురాలు కావడం గర్వకారణమన్నారు. బ్రిటీష్ బలగాకు ఎదురొడ్డి పోరాడిన దీశాలి సుబ్బమ్మ అన్నారు. అందుకే ఆమెను గాంధీ దేశ బాంధవిగా పిలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు, తోరాటి వసంతరావు, బోనం సత్యనారాయణ, దేవవరపు నీలకంఠరావు, బొర్రా రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి

ప్రజాశక్తి పెదపూడి

నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన పెదపూడిలో రూ.50 లక్షలతో నిర్మించే మండల రెవెన్యూ కార్యాలయానికి ఎంఎల్ఎ నల్లమిల్లి, రుడా చైర్మన్ బొడ్డు అనంత వెంకటరమణ చౌదరి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నల్లమిల్లి మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, వంటి మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పాణింగపల్లి సీతాపతిరావు, ఎఎంసి చైర్మన్ జుత్తుక సూర్యకుమారి, ఆత్మ కమిటీ చైర్మన్ రావాడ నాగు, ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, సానా శ్రీనివాసు, టిబిరిశెట్టి గణేష్, గండ్రేడు విఆర్ఒ ఏడుకొండలు, చిలకమ్మ పాల్గొన్నారు.

స్వర్ణ ఆంధ్రపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, కరప

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన పెంచాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిఎంఎం జి.భ్రమరాంబ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశుభ్రత ద్వారానే ప్రజారోగ్యం బాగు పడుతోందన్నారు. మున్సిపల్ డిఇ డిఎస్ ప్రకాశరావు మాట్లాడారు. అనంతరం మున్సిపల్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఒలు నర్గీస్, శ్రీదేవి, పాల్గొన్నారు.కరప గ్రామ పంచాయతీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ సలాది వెంకట శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. దుర్గ గుడి సెంటర్లో మానవహారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలా దేవి పాల్గొన్నారు.

పలువురికి జెడ్‌పిటిసి సాగర్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాళ్లరేవు

జెడ్‌పిటిసి సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ శనివారం పటవలలోని రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న బొడ్డు రాంబాబును పరామర్శించి బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు.కిడ్నీ స్టోన్స్, నడుము నొప్పితో బాధపడుతున్న రాయుడు ప్రసాద్‌ను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, ఉప సర్పంచ్ చెక్కా లక్ష్మణ్, నేల శ్రీనివాస్ ఉన్నారు.

ఎపిఎన్‌జిఒ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఎన్నుకున్నారు. జగ్గంపేట యూనిట్‌కు జరిగిన ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా టివి.సత్యనారాయణ, వి.క్రాంతికుమార్, సరెళ్ల చంద్రరావు వ్యవహరించారు. పిట్టా ప్రభాకర్‌ను యూనిట్ అధ్యక్షునిగా అసోషియేట్ అధ్యక్షులుగా ఎ.చల్లారావు, ఎల్.నాగేశ్వరరావులు, ఉపాధ్యక్షులుగా సిహెచ్.పారా పాల్ కుమార్, కె.రాజరత్నం, సెక్రటరీలుగా ఎం.సునీల్ కుమార్, పి.గణేష్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.బాబ్జి, ఎన్ఎస్‌జి.ప్రసన్న కృష్ణ, మహిళా జాయింట్ సెక్రటరీగా పి.రోజా, కోశాధికారిగా సిహెచ్.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.

ఘనంగా కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి-పెద్దాపురం, తాళ్లరేవు

పాండవ గిరి పెయింటర్స్ అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌బి.కొత్తూరులో పామాయిల్ తోటలో శనివారం కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గడపా భద్రరావు, చావలి చందు, కరణం అప్పారావు, కొప్పుల శేఖర్, యాసలపు మహేష్, పి.రమేష్, పల్లా శివ, వల్లపు సూరిబాబు, నీలం శ్రీను, వాసూరావు, ఎండి ఆలీ, కంపర వీరబాబు, గొల్ల భద్రరావు, నీలం ఉదయ్‌కుమార్, కడియాల రామకృష్ణ, జి.రాజు, తోటరాజు, అర్జున్ పాల్గొన్నారు.

తాళ్లరేవు శివాలయంలో అగ్నికుల క్షత్రియుల ఆధ్వర్యంలో శనివారం కార్తీక సమారాధన ఘనంగా నిర్వహించారు. పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, బొడ్డు సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

హైవేలో ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు

ప్రజాశక్తి - జగ్గంపేట

జాతీయ రహదారిపై ఉన్న బ్లాక్ స్పాట్‌లను ఎఆర్ ఎఎస్‌పి ఎస్.శ్రీనివాసరావు, సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్‌తో కలిసి శనివారం పరిశీలించారు. కిర్లంపూడి మండలం సోమవరం నుంచి గండేపల్లి మురారి వరకూ ఉన్న 27.2 కిలోమీటర్ల 216 హైవేను పరిశీలించి 20 బ్లాక్ స్పాట్స్ గుర్తించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాటిని గుర్తించినట్టు సిఐ తెలిపారు. ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయో ఎఎస్‌పి తెలుసుకున్నారని, వాటి నివారణకు త్వరలో చర్యలు తీసుకుంటారని పోలీసులు తెలిపారు.


వడ్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని వడ్లూరు సర్పంచ్ రఘుమండ తేజశ్రీ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వడ్లూరు సంపద తయారీ కేంద్రం వద్ద నిర్వహించిన సమాజ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం పాటించాల్సిన శుభ్రత, నియమాలు, అలవాట్లు, శాస్త్రీయ పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఆంజనేయశర్మ, మండల శానిటేషన్ కోఆర్డినేటర్ కత్తుల ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి టి.రాజ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ చినపోసియ్య, తహశీల్దార్ శ్రీనివాస్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలం వంగలపూడి, సింగవరం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్పంచ్ సంగన చినపోసియ్య, సొసైటీ చైర్మన్ మద్దిపాటి సుజీరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ధాన్యాన్ని తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా శుభ్రం చేసి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ గౌరీదేవి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెరుకుమిల్లిలో భూసమస్యలపై గ్రామసభ

ప్రజాశక్తి-గోపాలపురం

గతంలో రీసర్వే పూర్తి చేసిన చెరుకుమిల్లిలో జాయింట్ ఎల్‌పిఎంఎస్(భూ సమస్యలపై) శనివారం గ్రామసభ నిర్వహించామని రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పివి.సాంబశివరావు తెలిపారు. గ్రామ పరిధిలో మొత్తం 2,827 ఎకరాల్లో రీసర్వే చేశామన్నారు. సుమారు 16 మందికి సంబంధించి భూ సమస్యలు, జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సుమారు ఆరుగురికి సంబంధించి భూ సమస్యలు పరిష్కరించామన్నారు. మండలంలో 19 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 10 గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో ఈ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ కాంతారావు సర్వేయర్లు అభిరాజ్, ప్రతాప్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.